వరద బాధితుల ఆకలి కేకలు

- మూడు రోజులుగా తిండి లేక అలమటిస్తున్న బాధితులు
- గుక్కెడు నీళ్లు అందని వైనం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రజానీకం
- కొన్ని ప్రాంతాల్లో పునరుద్ధరించిన విద్యుత్ సరఫరా


జల వలయంలోనే వైవీ రావు ఎస్టేట్


వరద నీటిలో మిల్క్ ప్రాజెక్టు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'మూడు రోజులుగా తిండి లేక అలమటిస్తున్నాం. ఎవరూ మమ్మల్ని పట్టించుకోవటం లేదు. అధికారులు, ముఖ్యమంత్రి అందరూ సింగ్‌నగర్ అంటూ అక్కడే పర్యటిస్తున్నారు. గట్టువెనుక ప్రాంతాలు మీకు పట్టవా.....' అంటూ గట్టువెనుక ఉన్న పలు ప్రాంతాల్లోని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవటం, సకాలంలో ఆహారం అందకపోవటంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. స్వచ్ఛంద సంస్థలు స్థానిక నేతలు సాయమందించినా అరకొరగానే కొనసాగటంతో పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రావటం లేదు. గుక్కెడు నీళ్ల దొరక్క అవస్థలు పడుతున్నారు. ఎక్కడో దూరంగా ఉండి వాహనాలను ఖాళీ చేసుకొని అధికారులు వెళ్లిపోతున్నారే తప్పా లోపల అల్లాడుతున్న బాధితుల ఆకలిని తీర్చే పరిస్థితులు లేకుండా పోయాయని స్థానిక ప్రజానీకం మండిపడుతున్నారు.

బాధితులకు చేరని సాయం

ఆహారం భారీ ఎత్తున సిద్ధం చేసినా బాధితులకు చేర్చటంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వివిధ శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా పరిస్థితులు గందరగోళంగా మారాయి. ప్రధానంగా ఆహారాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు బాధిత ప్రాంతాలు ఉన్న చోటుకు వివిధ వాహనాల్లో తరలిస్తున్నారు. వాహనం ఆగగానే అక్కడికక్కడే సగం పొట్లాలు, మంచినీరు పంపిణీ జరిగిపోతుంది. వాస్తవంగా లోపల వరదనీటిలో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఆహారం అందటం లేదు. ప్రధానంగా కబేళా, ఏకలవ్యనగర్, ఊర్మిళానగర్, వించిపేట పరిసర ప్రాంతాల్లో ఈ విధమైన పరిస్థితులు అధికంగా ఉన్నాయి.

కాలనీకి సాయం అందలేదు

బుడమేరు వరద నీటిలో కాలనీ మొత్తం మునిగిపోతే మూడు రోజుల నుంచి ఇటు వైపు తొంగి చూసిన నాథుడే లేరని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రజాప్రతినిధిగానీ, అధికారులుగానీ వచ్చి ఎలా ఉన్నారని అడిగిన పాపాన పోలేదని వాపోతున్నారు. కాలనీ ప్రజలే ఒకరికొకరు సాయం చేసుకోవడం మినహా ఎటువంటి సాయం అందలేదని చెబుతున్నారు. వచ్చామని చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు ఎప్పుడు వచ్చారో తమకు తెలియదని, ఒక వేళ కాలనీ మెయిన్ రోడ్డులోకి వచ్చి వెళ్లారేమో తెలియదని వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్సార్ కాలనీ ఎదురుగా ఉన్న వైవీ రావు ఎస్టేట్‌లో నివసిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ వరకు మునిగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అగమ్యగోచరంగా..

ప్రభుత్వ తీరుపై స్థానిక ప్రజానీకం మండిపడుతున్నారు. మూడు నాలుగు రోజులుగా ఏ ఒక్క అధికారి తమ వద్దకు రాలేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చి పునరావాస కేంద్రాల్లో తలోదాచుకోవాలని భావిస్తున్నా, వారిని అక్కడి నుంచి తీసుకెళ్లటానికి ఎవరూ రాకపోవటంతో ఆయా ప్రాంతాల్లో బాధిత కుటుంబాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. అలాగే తమ బంధువులింటికీ వెళ్దామన్నా తమను బయటకు తెచ్చే వారు లేక అల్లాడిపోతున్నారు. అదేవిధంగా ఫోన్లలో తమవారికి సమాచారమందించాలని ఉన్నా పని చేయని పరిస్థితులు ఉండటంతో తాము అగమ్య స్థితిలో ఉన్నామంటూ కుటుంబాలు వాపోతున్నాయి. వరద ఉధృతి కారణంగా ఆయా ప్రాంతాలన్నింటిలోనూ విద్యుత్ శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా సరఫరాను నిలిపివేసింది. దీంతో అల్లాడిపోయిన పరిస్థితులు తెలిసిందే. వించిపేట తదితర ప్రాంతాల్లో వరద ఉధృతి కొంత తగ్గుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సరఫరాను కొన్ని ప్రాంతాల్లో పునరుద్ధరించింది. దీంతో స్థానిక ప్రజానీకం ఊపిరిపీల్చుకుంది. విద్యుత్ రావటంతో మంచినీటి మోటర్ల ద్వారా నీటిని పట్టుకోవటానికి అవకాశం లభించింది.

జక్కంపూడి కాలనీ వాసుల ఆవేదన

చిట్టినగర్,భవానీపురం(విజయవాడపశ్చిమ): చుట్టూ నీరు ఉన్న తాగేందుకు గుక్కెడు నీళ్లు లేని పరిస్థితి.. వర్షం తగ్గుముఖం పట్టి రెండు రోజులైనా కాలనీలో ఇంకా నాలుగు అడుగుల మేర వరద నీరు పారుతుంది.. కనీసం ఏ రాజకీయ నాయకుడైనా.. అధికారారైన కన్నెత్తి చూడలేదు.. కనీసం తిన డానికి తిండి లేదు... కనీసం మంచినీళ్లు కూడా అందించలేదని పరిస్థితి జక్కంపూడి కాలనీ వాసులది. ఏ ఒక్కరిని కదిపినా... మనస్సు కలిచివేసేలా వారి దీనగాథే... వర్షం వదిలినా....కాలనీ వాసులకు వరద కష్టాలు వీడటం లేదు... జక్కంపూడి కాలనీలో సుమారు 8 వేల ప్లాట్లు ఉండగా, అందులో 30 వేల పైబడి ప్రజలు నివాసం ఉంటున్నారు. కాలనీలోని ప్లాట్లలోని గ్రౌండ్ ఫ్లోర్‌న్ని వరద ముంపునకు గురి కాగా అందులో నివాసం ఉంటున్న రెండు వేల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ రెండు వేల కుటుంబాలు గడిచిన మూడు రోజులుగా తినేందుకు తిండి లేక తాగేందుకు చుక్క నీరు లేక అల్లాడిపోతున్నారు... ఆకలితో తీవ్ర ఆవేదన వారిని ఎదురు తిరిగేలా చేస్తున్నాయి. వరద వచ్చిన మొదటి రోజు అందిన అల్పాహారం చిన్న పిల్లలకు అందించి, పెద్దలు పస్తులుంటున్నారు. చుట్టూ చీకటి.. బయట ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి... తెలిసిన వారిని ఆరా తీద్దామంటే సెల్‌ఫోన్‌లో చార్జింగ్ లేకపోవడంతో కాలనీ వాసుల తమ గోడు ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి. సోమవారం మధ్యాహ్నం నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో కాలనీ వాసులు గుంపుగుంపులుగా బయటకు వచ్చేస్తున్నారు. కాలనీ నుంచి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న చిట్టినగర్‌కు వెళ్లి తాగేందుకు నీరు, అల్పాహారం, ఇతర ఆహార పదార్థాలను తెచ్చుకుంటున్నారు. దారి మధ్యలో దాతలు, అధికారులు ఇచ్చిన ఆహారం. పాలు, బిస్కెట్ల కోసం ఎంతో ఆశతో పరుగులు పెడుతున్నారు. దాతల నుంచి అందుకున్న పాలు, బిస్కెట్లు, పులిహోరను ఇంటి దగ్గర ఉన్న కుటుంబానికి అందించాలని తాపత్రయపడుతున్నారు.

ఫ్లై ఓవర్ ఎక్కితేనే తిండైనా.. నీళ్లైనా...!

జక్కంపూడి కాలనీలో ఇంకా నాలుగు అడుగుల మేర నీరు ఉండటంతో సాయం అందించేందుకు ఎవరూ లోపలకు వెళ్లేందుకు సాహసించడం లేదు. ట్రాక్టర్లు, మినీ వ్యాన్లు సైతం కాలనీలోకి వెళ్తితే నడిమధ్యలో నిలిచిపోతున్నాయి. దీంతో కాలనీ వాసులు పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్, సీఎన్‌జీ గ్యాస్ బంక్ పరిసరాలకు వచ్చిన వారికే సాయం అందుతుంది. పాలు, ఆహార పదార్థాలు అందించే వారి కోసం ఎదురు చూడటమే కాకుండా ఆయా వాహనాలు వచ్చినప్పుడు వాటి వెంట పరుగులు పెడుతున్నారు. వరద కష్టాలు ప్రస్తుతం తీరేలా కనిపించడం లేదు. వరద తగ్గుముఖం పట్టినా, విద్యుత్ పునరుద్ధరణ ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు.

వలస జీవుల వేదన వర్ణనాతీతం..

కాలనీలో నివాసం ఉంటున్న 12 వేల కుటుంబాలలో సుమారు 3 వేల కుటుంబాలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారే.. వీరిలో అత్యధికులు బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌ల నుంచి వచ్చిన వారే. వీరు చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఏ రోజు ఆదాయంతో కాలం వెళ్లదీస్తుంటారు. అయితే వరద ఆయా కుటుంబాలకు తీరని వేదనను మిగిలించి. చేసేందుకు పని లేక చేతిలో డబ్బులు లేక, తినడానికి ఎవరైనా ఇంత తిండి పెడతారనే ఆశతో ఎదురు చూపులు చూస్తున్నారు. అయితే ప్రభుత్వ సాయం కూడా కాలనీలోకి రాకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత కాలం ఆదుకుని జీవనోపాధిని కల్పించిన విజయవాడే తమకు ఇంత ఆవేదనను మిగిలిందని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

మహిళలు, వృద్ధుల పరిస్థితి ఆందోళనకరం

జక్కంపూడి కాలనీ రోడ్లలో గోతులతో భయనకం నెలకొంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతం. ఇంట్లో నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితిలో ఇంటికే పరిమితం అయ్యారు. ఇంట్లోకి అత్యవసరమైన సరుకులు తెచ్చుకుందామన్నా నడుం పైభాగం వరకు నిండిపోయిన నీళ్లలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దాదాపు 72 గంటలకుపైగా నరకం అంటే ఏమిటో ప్రత్యక్షంగా అనుభవించామని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం నాటికి బుడమేరు వరద ఉధృతి కొంత తగ్గటంతో పిల్లలు, మహిళలను సురక్షిత ప్రాంతాలకు(బంధువుల, స్నేహితుల ఇళ్లకు) తరలించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అన్ని అవసరాలకు వరద నీరే

విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద బాధితుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. అనుకోని ముంపు ప్రభావంతో మూడు రోజులుగా ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడం.. ప్రభుత్వం తాత్కాలిక సరఫరా చర్యలు తీసుకోకపోవడంతో అక్కడ నివసిస్తున్న వారికి ఇంటి ముందు ప్రవహిస్తున్న వరద నీరే అన్ని అవసరాలకు దిక్కవుతోంది. రోడ్లపై పారుతున్న వరద నీటిని బిందెలు, బక్కెట్లతో పట్టుకుని స్నానం చేసేందుకు, ఇల్లు శుభ్రం చేసుకునేందుకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇదే నీటిని కాచి చల్లార్చి తాగుతున్నామని బాధితులు చెబుతున్నారు. అనేక మురుగు డ్రెయిన్‌లను కలుపుకుని వచ్చే ఈ వరద నీటి వల్ల భవిష్యత్తులో ఎలాంటి రోగాలు వస్తాయోననే భయం వెంటాడుతున్నా.. ప్రస్తుతానికి ప్రాణం కాపాడుకునేందుకు వేరే గత్యంతరం లేక ఈ నీటిని తాగుతున్నామని వాపోతున్నారు.


వైవీ రావు ఎస్టేట్‌లోని గోడౌన్‌లో నీట మునిగిన సరుకు


కబేళా సెంటర్ నుంచి సామాన్లు తీసుకువెళ్తున్న యువకుడు


వైఎస్సార్ కాలనీలో ఆహారం ప్యాకెట్ పట్టుకునేందుకు యత్నిస్తున్న యువకుడు


ఆహారం అందుకున్న ఆనందంలో..


పరుపుపై పిల్లలను కూర్చోబెట్టి తీసుకువెళ్తున్న ఓ కుటుంబం


చిట్టినగర్‌లో పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే సుజనా చౌదరి


పాలఫ్యాక్టరీ వద్ద కుళాయిలో నీరు పట్టుకుంటున్న యువకులు

క్లుప్తంగా

ఎటు చూసినా వ్యర్థాలే



పటమట(విజయవాడతూర్పు): బుడమేరు వరద తగ్గుముఖం పట్టడంతో స్థానికంగా వ్యర్థాలు పేరుకుపోవటం, కొట్టుకు వచ్చిన చెత్తాచెదారంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మరో వైపు దాతలు, ప్రభుత్వం, వీఎంసీ సరఫరా చేస్తున్న ఆహార పొట్లాలు, పాలు, సరిగ్గా పంపిణీ చేయకపోవటంతో వాటిని అక్కడే పడేస్తున్నారు. ఉదయం సరఫరా అయ్యిన పాల ప్యాకెట్ల కోసం తొక్కిసలాట జరగటంతో చాలా వరకు అక్కడే ప్యాకెట్లు పగిలిపోయాయి. మరో వైపు వరద ప్రభావితంగా ఉన్న ప్రధాన ప్రాంతాలైన కండ్రిక, పాయకాపురం, పాత రాజరాజేశ్వరీపేట, రాజీవ్‌నగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాలకు ఆహార పొట్లాలు వెళ్లకపోవటంతో, వచ్చిన ఆహారం కూడా కుళ్లిపోవటంతో సింగ్ నగర్ ఫ్లై ఓవర్‌పై పడేశారు. దీంతో ఫ్లై ఓవర్ అంతా బురద, ఆహార వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉండటంతో విమర్శలు వస్తున్నాయి.

వరద నీట మునిగిన హెడ్ వాటర్ వర్క్స్



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో గల డాక్టర్ కె.ఎల్.రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వరద నీటి ముంపునకు గురయ్యింది. నగరంలోని మూడు నియోజకవర్గాలలోని మంచి నీటి రిజర్వాయర్లకు తాగు నీరు ఇక్కడి నుంచి సరఫరా చేస్తున్న నేపథ్యంలో అందుకు ఆటంకం కలిగింది. ముఖ్యంగా హెడ్ వాటర్ వర్క్స్‌లోగల మోటార్లన్నీ నీళ్లల్లో మునిగి పోవడంతో సరఫరాకు ఇబ్బందికరంగా మారింది. అలాగే నగరం మొత్తం జలదిగ్బంధంలో ఉండగా నీటి సరఫరా చేస్తే లీకులు ఉన్న పైప్ లైన్లలోని వరద నీరు కలిసి కలుషిత నీళ్లు కుళాయిల ద్వారా వచ్చే అవకాశం ఉన్నందున నీటి సరఫరాను నిలిపి వేశారు. మంగళవారం వరద ఉధృతి తగ్గటంతో రిజర్వాయర్లకు మంచినీటి సరఫరా ప్రారంభించారు.

ముంపు బాధితులకు కొత్త కష్టాలు

విజయవాడస్పోర్ట్స్: ఎగువనున్న కొండ ప్రాంతాల నుంచి బుడమేరు వరదలో కొట్టుకొచ్చిన జలగలు, పాములు, కొండ చిలువలు ముంపు బాధితులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. విజయవాడ నగరంలోని పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లోని 20 కాలనీల్లో ఇళ్లు వరద నీటితో నిండిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో ఒక్కొక్కరుగా వారివారి ఇళ్లను చూసుకునేందు వెళ్లి ఖంగుతింటున్నారు. నివాస ప్రాంతాల్లో వరద ప్రభావంతో చెల్లాచెదురుగా పడి ఉన్న సమాన్ల మాటున విషసర్పాలు, కొండ చిలువలు తిష్టవేసి స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. విష సర్పాలతో పాటు రక్తం పీల్చే జలగలు సైతం నీటిలో హల్‌చల్ చేస్తున్నాయి. వరద నీటిలో రెండు నిమిషాలు ఒకే చోట నిలబడితే కాళ్లకు జలగలు పట్టుకుంటున్నాయని బాధితులు చెబుతున్నారు.

6న వ్యాయామ అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి వ్యాయామ అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టు ఇంటర్వ్యూ ఈనెల 6వ తేదీకి వాయిదా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటర్వ్యూను 6వ తేదీ ఉదయం 11 గంటలకు మార్చామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈమార్పును గమనించాలని ఆమె కోరారు.

రేపటి నుంచి శత సహస్ర మోదక పూజ



విజయవాడ కల్చరల్: శృంగేరి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి స్వామి ఆదేశంతో శివరామ కృష్ణ క్షేత్రంలో 5వ తేదీ గురువారం నుంచి 29వ తేదీ ఆదివారం 25 రోజులపాటు వరకు శత సహస్ర(లక్ష) మోదక లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో మంగళవారం వివరాలను వెల్లడించారు. సర్వ విఘ్న నాయకుడిని పూజించడం వల్ల సకల ఐశ్వర్యాలు కలుగుతాయని వివరించారు. జగద్గురువుల ఆదిశంకరులు ప్రతిపాదించిన పంచాయతన విధానంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ గణపతి పూజ, గణపతి అధర్వ శీర్షోపనిషత్ పారాయణ, ప్రదోష వేళల్లో సహస్ర నామార్చన, కార్యక్రమాలుంటాయని తెలిపారు. వివరాలు కలిగిన పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో గండూరి చంద్రమౌళి ఉన్నారు.

ఆపదలో దాతల ఆపన్న హస్తం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతం జలదిగ్బంధమైన నేపథ్యంలో పలువురు దాతలు సాయం అందిస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ కుటుంబం మంగళవారం భవానీపురం హెచ్‌బీకాలనీ, వెలంపల్లి కాలనీ, పోలీస్ స్టేషన్ రోడ్, సితార సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, కబేళా సెంటర్, ఊర్మిళానగర్ తదితర ప్రాంతాల్లో నాలుగు ట్రాక్టర్ల ద్వారా మంచి నీరు, పాలు, బిస్కట్స్, ఫుడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. అలాగే వరద నీళ్లల్లోనే ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా ఆకుల శ్రీనివాస్ కుమార్ భవానీపురంలోని తన నివాసంలో బాధితులకు పునరావాసం కల్పించటమే కాకుండా భోజన ఏర్పాట్లు చేశారు. సేవలకు ఆకుల కుమారులు డాక్టర్ రాజ్‌కుమార్, ఇంజినీర్ విజయ కుమార్ నేతృత్వం వహించగా బాషా, వినయ్, ఫణీంద్ర తదితరులు ఉన్నారు.

ఆహార పంపిణీ చేపట్టిన ఆసిఫ్ బృందం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ఆహార పంపిణీని మంగళవారం సైతం కొనసాగించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆసిఫ్ తన బృందంతో సేవలందిస్తూ వారికి అండగా ఉంటున్నారు. ఆ క్రమంలో మంగళవారం రెండు వేల మందికి సరిపడ ఆహార పొట్లాలను తన అనుచరలతో కలిసి పంపిణీ చేశారు. విద్యాధరపురం, కబేళా, వించిపేటతో పాటుగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతల్లో ఆహారాన్ని, మంచినీటిని పంపిణీ చేశారు. అదేవిధంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసి బయటకు వచ్చేందుకు చూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులను ఇతర ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస రెడ్డి, శంకరరెడ్డి, గౌరి, వినోద్, షేక్ బాజీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అందరూ అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరద బాధిత కుటుంబాలకు సమాజంలో ఉన్న అందరూ అండగా ఉండాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అల్లాడుతున్న వరద బాధిత కుటుంబాలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమాన్ని మూడు రోజులుగా నిర్వహిస్తోంది. రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్‌ఎస్‌ఎస్‌తో పాటుగా వివిధ విభాగాల సమన్వయంతో ఆయా ప్రాంతాల్లో పంపిణీని కొనసాగిస్తున్నారు. శేషయ్య, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ.. వరద తగ్గే వరకూ సాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు గోళ్ల బాబావిజయకుమార్, రాఘవయ్య, జే శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆకుల శ్రీనివాస్ కుమార్


వరద బాధితులను తరలిస్తున్న నాయకులు


వాహనాన్ని ప్రారంభిస్తున్న శేషయ్య తదితరులు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వరద నీరు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ విజయవాడ సర్కిల్‌లో పనిచేసే 250 మంది సిబ్బంది కాకుండా వివిధ జిల్లాల నుంచి 594 మంది విద్యుత్ సిబ్బంది విజయవాడకు రప్పించి పనులు చేస్తున్నారు. గొల్లపూడి, భవానీపురం, వాంబేకాలనీల్లోని పరిసర ప్రాంతాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులు చేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ.సుధాకర్ చెప్పారు. మిగిలిన విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో కూడా సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వరదల కారణంగా విజయవాడ సర్కిల్ పరిధిలో మొత్తం 12 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మునిగిపోవడం, ఇంటి మీటర్లు వరద నీటిలో ఉండటం కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశామని చెప్పారు. ప్రస్తుతం వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులు చేపట్టామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల పనితీరు ఆధారంగా..

వరద నీరు తగ్గిన ప్రాంతాలను తాము స్వయంగా పరిశీలించి ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల పనితీరును తాము స్వయంగా పరిశీలించి నిర్ధారణ చేసుకున్న తర్వాతే విద్యుత్ సరఫరా చేస్తామని సుధాకర్ చెప్పారు. వరద నీరు తగ్గని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా చేస్తే వినియోగదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వరద నీరు తగ్గి, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇంటి గోడలకు అమర్చిన విద్యుత్ మీటర్లను పరిశీలించిన తర్వాతే విద్యుత్ సరఫరాను చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

• **విజయవాడస్పోర్ట్స్:** వరద నీటిలో కొట్టుమిట్టాడుతున్న బుడమేరు బాధితులను దొంగలు టార్గెట్ చేశారు. సోమ, మంగళవారాల్లో బాధితులు వారి వారి ఇళ్లను వదిలేసి ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఒడ్డుకు చేరారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. మంగళవారం వరద తగ్గడంతో బాధితులు వారి వారి ఇళ్లకు వెళ్లడంతో ఇళ్లలో చోరీలు జరిగినట్లు గుర్తించారు.

ముగిసిన సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా స్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా వారం రోజులుగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక సంగీతోత్సవాలు బుధవారం ఉదయం ముగిశాయి. శాస్త్రీయ సంగీతానికి పెద్ద పీట వేస్తూ విద్వాంసులు నిర్వహించిన కచేరీలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. వీవీ రాఘురామ ప్రణద, ఆర్. వైష్ణవి, పెరవలి జయతి, పెరవలి మహతి వాగ్గేయకారుల కృతులను ఆలపించారు. చివరిగా కె. తుషార పూర్ణవల్లి నిర్వహించిన కచేరీ ఆకట్టుకుంది. వయోలిన్‌పై కె. సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై ఎం. కృష్ణ సాయి సహకరించారు. సంస్థ నిర్వాహకులు మాధవి పాల్గొన్నారు.

